# ఊహించని మలుపు

## ఎల్. సంపత్‌కుమార్




చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో పల్లెలో ఉన్న నానమ్మను వదిలేసి బాబాయ్‌తో పాటు హైద్రాబాదుకు వచ్చిన నాకు సెలవులలో మా పల్లెకు వెళ్ళి గడపటం అంటే ఎంతో సరదాగా ఉండేది. మా పల్లెలో నాన్నమ్మ, చిన్ననాటి స్నేహితుడు రాజు, ముత్యాలు, వాళ్ళమ్మ కాంతమ్మ వీళ్ళు మాత్రమే నాకు తెలుసు. రాజుతో ఆడుకుంటే నాన్నమ్మ ఏమి అనేది కాదు కానీ ముత్యాలుతో ఆడుకుంటే మాత్రం కసిరేది. కాంతమ్మకు నేనంటే చాలా యిష్టం. ఊర్లో వున్నన్ని రోజులు ఎంతో మురిపెంగా చూసుకొనేది. నేను సెలవులలో అక్కడికి వెళ్ళానంటే చాలు రాజు, ముత్యాలు ఎగిరిగంతేసేవారు. పదవ తరగతి వరకు తరచుగా మా పల్లెకు వెళ్ళే నేను చివరిసారిగా నాన్నమ్మ చనిపోయినప్పుడు వెళ్ళాను. తర్వాత అక్కడవుంటే ఆస్తులన్నీ బాబాయ్ అమ్మేశాక మా పల్లెకు వెళ్ళడానికి కుదరలేదు. ఎప్పుడన్నా రాజును, ముత్యాలును చూడడానికి వెళ్ళాలని వున్నా చదువు మూలాన వెళ్ళడానికి కుదరలేదు. అప్పుడప్పుడు ఉత్తరాలు రాస్తున్న రాజుకు నేను జవాబు రాయకపోవడంతో అవి కూడా రావడం ఆగిపోయాయి.

బాబాయ్ ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్ళడం, కొన్నాళ్ళకు బాబాయ్ కుటుంబంతోపాటు నేను కూడ అమెరికా వెళ్ళడం, అక్కడే నా చదువు పూర్తవడం, ఉద్యోగం రావడం, అక్కడేవున్న బాబాయ్ తెలిసిన వాళ్ళ అమ్మాయితో పెళ్ళవ్వడం, ఇద్దరు పిల్లలు పుట్టడం, ఇలా యాంత్రిక జీవితానికి అలవాటు పడినా, మన భాషను, సంప్రదాయాలను మరచిపోకుండా కాపాడుకుంటూ అది పిల్లలకు కూడా వంటబడేటట్లు చేశాను.

మా పెద్దబ్బాయికి పెళ్ళి వయసొచ్చేసింది. సంబంధాలు వెతకడం ప్రారంభించే సమయంలో నాతో పాటు మా కంపెనీలో పనిచేస్తున్న మా దూరపు బంధువు స్నేహితుడైన ఆర్. కె. చౌదరి కొడుకు పెళ్లి విజయవాడలో జరగబోతోంది. ఆ పెళ్ళికి మా ఆవిడతోపాటు తప్పకుండా రమ్మని పిలుపు వచ్చింది. ఆ పెళ్ళిలో అబ్బాయికి తగిన అమ్మాయి దొరుకుతుందనే ఉద్దేశ్యంతో పెళ్ళికి వాళ్ళతో పాటు బయలుదేరాం నేనూ మా ఆవిడా.

అప్పుడే నాకు గుర్తుకొచ్చింది కృష్ణా జిల్లాలోని మా పల్లె. అక్కడికి వెళ్ళగానే మరుసటి రోజే మా పల్లెకు తప్పకుండా వెళ్ళాలని కూడా నిర్ణయించుకున్నాను.

విజయవాడకు చేరగానే మరుసటి రోజు నేను మా పల్లెకు బయలుదేరాను ఆర్. కె. చౌదరివాళ్ళ కారు తీసుకుని. మారిపోయిన ఆ పల్లెను చూస్తే ఎంతో ఆశ్చర్యం వేసింది. చిన్ననాటి స్నేహితుడు రాజు, ముత్యాలు ఇంక ఈ ఊర్లోనే వున్నారా అనే సందేహంతో కారు రామాలయం దగ్గర ఆపించాను. రాజు వుండే ఇంటి ఆవరణలో పెద్ద డాబా ఇల్లు కనపడేసరికి కొంత కంగారు పడ్డా అప్పుడే బయటకు వస్తున్న ఒక లావుపాటి వ్యక్తిని చూసి అతనిలో రాజు పోలికలు లీలగా కనబడగానే 'రాజు' అంటే మీరేనా అని అడిగాను.

"అవును' అంటూ మీరు అని కాసేపు ఆగి ఆనందంతో 'రామారావు నువ్వా' అంటూ గట్టిగా 'ముత్యాలు" అంటూ పిలిచాడు రాజు.

"ముత్యాలు ఈ ఇంటిలోనే వుందా?" ఆశ్యర్యంతో అడిగే సరికి -

"ఉందా! ఏమిటి? ముత్యాలు నా భార్య" నవ్వుతూ చెప్పాడు రాజు.

అక్కడికి ముత్యాలు రాగానే

"మన రామారావు" అంటూ రాజు చెప్పేసరికి ముత్యాలు ముఖంలో ఏదో మార్పు నేను గమనించేలోపే...

"రా అన్నయ్య, చాలా యేళ్ళ తర్వాత గుర్తుకొచ్చాం" అంటూ ఆప్యాయతతో పిలిచేసరికి ఏదో తెలియని అనుభూతికి లోనయింది నా మనసు.

రాజు ముత్యాల్ని చేసుకోవడం ఆశ్చర్యం. నన్ను ముత్యాలు అన్నయ్య అని పిలవడం ఆనందం. ముత్యాలు నిజంగా నా చెల్లెలని తెలియడం నిజంగా విచిత్రం. ఎందుకంటే ముత్యాలు అసలు విషయం చెప్పేంతవరకు ఎన్నో యేండ్ల దాగి వున్న నిజం అది నేను యిక్కడికి వచ్చిన తర్వాత బయటకు వచ్చింది. మా అమ్మ చనిపోయిన తర్వాత ముత్యాలు అమ్మను మా నాన్న పెళ్ళి చేసుకున్నాడంట. అది మా నాన్నమ్మకు, బాబాయ్‌కు యిష్టం లేదంట. నేను చిన్నతనంలో వున్నప్పుడు ఈ విషయం నాకు తెలియదు. మా నాన్నమ్మ, బాబాయ్ కూడా ఎందుకు చెప్పలేదో నాకు అర్థం కాలేదు. బహుశ ఆస్తి కోసం లేక నేను వాళ్ళకు దగ్గరవుతానన్న భయంతో చెప్పలేదేమో అని మనసులో అనుకుంటూ " కనీసం మీకు తెలిసిన ఎందుకు చెప్పలేదు" రాజును, ముత్యాలుని అడిగాను.

## ఋణపడి ఉంటాను...

కలత చెందిన నా మనసులో
కమ్మని భావనలు నింపినది నీవు
అలసట చెందిన నా హృదయానికి
ఆలంబనగా నిలిచినది నీవు
నిన్నటి ఆలోచనలలో నలుగుతున్న నాకు
రేపటి గురించి ఆశలు నింపినది నీవు
నా లోని భావుకతకు, సామర్థ్యాలకు
సరియైన ప్రేరణగా నిలిచి
సాధించగలనన్న నిశ్చయాన్ని
అనునిత్యం నాలో నింపినది నీవు
నన్నింతలా నడిపిస్తున్న
"అంతశ్చేతనమా"
అనుక్షణం, అజన్మాంతం
నీకు
ఋణపడి ఉంటాను

**- డాక్టర్ ప్రసాద్ కల్లూరి**

"మేము పెద్దయ్యాకే అదే మా అమ్మ చనిపోయే ముందు మాకు ఈ నిజం తెలిసింది. తర్వాత మీకు ఈ విషయం తెలపాలని ఎంత ప్రయత్నం చేసినా నీ గురించి తెలియలేదు" అని ముత్యాలు అనగానే బాబాయ్ నాకు తెలియకుండా చేసివుంటాడనుకున్నాను. నాన్నమ్మ ముత్యాలింటికి వెళితే ఎందుకు కసురుకొనేదో, కాంతమ్మ ఎందుకు ప్రేమగా చూసుకునేదో ఇప్పుడు తెలిసింది నాకు.

* * *

ఒక అమ్మాయి అక్కడికి రాగానే ఎవరని ఆశ్చర్యపోతున్న నాకు -

"మా అమ్మాయి పేరు శ్రీదేవి" అంటూ ముత్యాలు నాకు పరిచయం చేసింది. ఈసారి "మీ రామారావు మామయ్య" అంటూ నన్ను శ్రీదేవికి పరిచయం చేసింది. వెంటనే శ్రీదేవి నన్ను ఉద్దేశిస్తూ రెండు చేతులనూ జోడించి 'నమస్కారం' అంది.

"ఈ సంవత్సరమే బి.యస్.సి. కంప్యూటర్ అయిపోయింది. పెళ్ళి సంబంధాలు వెతుకుతున్నాం" అని ముత్యాలు చెప్పేసరికి వెతకపోయిన తీగ కాలుకు తగిలినట్టు ఎంతో ఉప్పొంగిపోయింది నా మనసు. వెంటనే "మా అబ్బాయి పెళ్ళి సంబంధం కోసమే విజయవాడకు ఆర్.కె. చౌదరి వాళ్ళబ్బాయి పెళ్ళికి ఇక్కడికి వచ్చాను. మా అబ్బాయికి మీ శ్రీదేవిని కాదు మా మేనకోడలిని చేసుకుంటాను" అంటూ నేను అన్ని వివరాలు మాట్లాడి సాయంత్రానికల్లా మా ఆవిడను ఇక్కడికి తీసుకొస్తానని చెప్పి కారులో విజయవాడకు బయలుదేరాను.

మా ఆవిడకు, ఆర్.కె. చౌదరి వాళ్ళకు మా పల్లెలో జరిగిన విషయాలు అన్నీ చెప్పగానే చాలా ఆశ్చర్యపోయారు.

"మా అబ్బాయి పెళ్ళికి వచ్చినందుకు తెలియని నిజం తెలిసి, మీ అబ్బాయికి తగిన సంబంధం దొరికింది. ఇంక ఆలస్యం చేయకుండా మీ ఆవిడను వెంటనే తీసుకెళ్ళి అమ్మాయిని చూపించు. ఆమెకు కూడా నచ్చితే వెంటనే అబ్బాయికి కబురంపండి. అతనికి కూడా నచ్చితే వెంటనే బాబును ఇక్కడికి పిలిపించి తిరుపతిలో గ్రాండుగా పెళ్ళిచేసి అమెరికాలో రిసెప్షను చేద్దా"మని చౌదరి అనగానే -

"మాతోపాటు మీరుకూడా పల్లెకు రండి." అని ఆహ్వానించా.

"ఇక్కడ పెళ్ళి పనులలో చాలా బిజీగా వున్నాను. ముందు మీరు వెళ్ళి రండి" అంటూ మమ్మల్ని కారులో మా పల్లెకు సాగనంపాడు.

మా ఆవిడకు కూడా శ్రీదేవి బాగా నచ్చింది. ముత్యాలు మా ఆవిడను వదిన అని పిలుస్తుంటే నేను చాలా సంతోషంగా ఫీలయ్యాను.

ఇ-మెయిల్ ద్వారా మా అబ్బాయికి ఫోటోతో పాటు అమ్మాయి వివరాలు పంపాను. కాని అమ్మాయి సొంత మరదలనే విషయం అమ్మాయి నచ్చిన తర్వాత చెప్పాలనుకున్నాం.

"మీ సెలక్షన్ చాలా బాగుంది" అని మా అబ్బాయినుండి కబురొచ్చింది.

వెంటనే మా నాన్నని పిలిపించడం. తిరుపతిలో పెళ్ళి జరగడం. ఆర్.కె. చౌదరి కుటుంబ సభ్యులు అందరూ పెళ్ళికి రావడం. అన్ని కార్యక్రమాలు సవ్యంగా చకచక జరిగిపోయేసరికి ఆనందంతో నా మనసు కుదుటపడింది. రాజుకు, ముత్యాలుకి వీడ్కోలు పలికి, కోడలు కొడుకుతోపాటు అమెరికా బయలుదేరాం. మా పల్లెను వదలిపోతున్నందుకు చాలా బాధ వేసింది. కాని నా జీవితంలో ఊహించని మలుపు తిప్పిన మా పల్లెకు ఏదో చేయాలని తపనతో అమెరికాకు వెళ్ళిన వెంటనే ఆర్.కె. చౌదరితోపాటు మిగతా స్నేహితులతో మాట్లాడి వారి సహాయముతో ఉచితంగా పేదలకు సేవలు అందించే అన్ని సౌకర్యాలతో కూడిన ఒక "ఆసుపత్రి" నిర్మించడం ద్వారా మా పల్లె ఋణాన్ని కొద్దిగా తీర్చుకున్నాను.

*